


శనివారం 20 జూన్ 2026 పేజీలు : 8

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి




# వర్షాకాలంలో థర్మల్ కేంద్రాలకు సరిపడా బొగ్గు సరఫరా చేస్తాము




వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి కొంత ఆటంకం ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేస్తామని సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం తెలంగాణ జెన్‌కో ఛైర్మన్ డాక్టర్ హరీష్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతిని కలిసి సమావేశమయ్యారు.

# సాదా బైనమా దరఖాస్తుల పరిశీలన పగడ్బందీగా చేపట్టాలి



జిల్లాలో సాదా బైనమా దరఖాస్తుల పరిష్కారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత రికార్డులను అనుసరించి పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని కోటపల్లి, చెన్నూర్ మండలాల తహసిల్దార్ కార్యాలయాలను బి సెక్షన్ సూపరింటెండెంట్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, భూ సేకరణ అంశాలపై కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాదా బైనమా దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ¬

# శ్రీరాంపూర్‌లో హక్కుల సాధనకు కదం తొక్కిన సింగరేణి అధికారులు



మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో తమ హక్కుల సాధన కోసం సింగరేణి అధికారులు కదం తొక్కారు .తమ న్యాయమైన హక్కులు, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సింగరేణి అధికారులు ఉద్యమ బాట పట్టారు. అఖిల భారత బొగ్గు గనుల అధికారుల సంఘం (సీఎంఓఏఐ) సింగరేణి బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అధికారుల డిమాండ్ల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

## రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి







**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జూన్ 19 ,( ప్రజాజ్యోతి ).** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి, అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ వీసీ లో భాగంగా ఆయన మాట్లాడుతూ, అన్ని జిల్లాలలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారంల పంపిణీ, తిరిగి స్వీకరణ, తదితర అంశాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. బూత్ లెవెల్ అధికారులకు తప్పనిసరిగా అన్ని అంశాలపై అవగాహన ముఖ్యమన్నారు. జిల్లాల వారిగా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణకు చేపట్టిన చర్యలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాల వివరాలు కలెక్టర్ల ద్వారా తెలుసుకున్నారు. ప్రక్రియను మొత్తం కలెక్టర్లు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. ఈ వీసీ లో భాగంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ఎస్ ఐ ఆర్ ప్రక్రియను మొత్తం పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ప్రక్రియకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తామని వివరించారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వాతి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, చిన్నారుల రక్షణకు భరోసా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల







**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జూన్ 19 ,( ప్రజాజ్యోతి ).** మహిళలు, చిన్నారులపై జరిగే లైంగిక వేధింపులు, అత్యాచారాలు కేసుల బాధితులకు సమగ్ర సహాయం అందించేందుకు భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు. బాధితులకు వైద్య, న్యాయ, మానసిక, పునరావాస మరియు ఆర్థిక సహాయాన్ని ఒకే వేదికపై అందించే విధంగా భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. భరోసా కేంద్రం ద్వారా బాధితులకు మెడికో-లీగల్ పరీక్షలు, కౌన్సిలింగ్, న్యాయ సహాయం, తాత్కాలిక ఆశ్రయం, పునరావాస సేవలు అందించబడతాయని తెలిపారు. అలాగే మరియు అత్యాచార కేసుల బాధితులకు ప్రభుత్వం కల్పించే పరిహారం అందించేందుకు జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా న్యాయ సేవా సంస్థ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో చర్యలు చేపడతారని వివరించారు. కేసుల దర్యాప్తులో దర్యాప్తు అధికారులు బాధితుల హక్కులను పరిరక్షిస్తూ, చట్ట ప్రకారం నిర్దేశించిన గడువుల్లో దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. బాధితులకు పరిహారం, న్యాయ సహాయం, పునరావాసం వంటి సేవలు అందేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లా విద్యాశాఖ, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మున్సిపల్ పరిధిలోని మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్ జిల్లా బాలల పరిరక్షణ యూనిట్ బాలల సంక్షేమ కమిటీ జువెనైల్ జస్టిస్ బోర్డు సఖీ కేంద్రం తదితర సంస్థలు మహిళలు, చిన్నారుల రక్షణ మరియు పునరావాస కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నాయని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులు భయపడకుండా పోలీసులను, భరోసా కేంద్రాలను లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ జానకి శర్మిల డీసీఐఆర్బీ ఎస్ఐ సంజీవ్ డీసీఐఆర్బీ సీఐ కిరణ్ డీఎస్పీ మురళి సీడబ్ల్యూసీ సభ్యులు శ్రీలత అనిల్ కుమార్ సైమన్ చైల్డ్‌లైన్ విభాగం కౌన్సిలర్ మరియు కోఆర్డినేటర్, ఎన్జీఓ ప్రతినిధులు, భరోసా కేంద్ర ఇన్‌చార్జ్ ఎస్ఐ నరసయ్య భరోసా కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజుర గ్రామంలో ఉచిత టీబీ వైద్య శిబిరం



**నేరడిగొండ జూన్ 19 (ప్రజాజ్యోతి) :** మండల పరిధిలోని రాజుర గ్రామంలో శుక్రవారం ఉచిత క్షయ (టీబీ) వ్యాధి నిర్ధారణ మరియు అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెల్త్ సూపర్‌వైజర్ ఎ. సంతోష్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, రెండు వారాల కంటే ఎక్కువ రోజులు తగ్గని దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం రావడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను, మందులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో టీబీ హెల్త్ విజిటర్ రవీందర్, ఎస్టీఎస్ నర్సయ్య, హెల్త్ అసిస్టెంట్ ( హెచ్ ఏ ) భీమరాజు, శ్రీనివాస్, సుధ తదితరులు పాల్గొని గ్రామస్థులకు టీబీ వ్యాధి పట్ల, దాని నివారణోపాయాల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం అనుమానిత లక్షణాలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు లావణ్య, శామ్కి బాయి, గంగామణి మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## దేశానికి రాహుల్ గాంధీ వంటి ధైర్యవంతమైన నాయకత్వం అవసరం

### పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ




**మంచిర్యాల, 19, జూన్ (ప్రజా జ్యోతి):** దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడే నాయకత్వం నేడు అత్యంత అవసరమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా ఆయనకు ఎంపీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, దేశం ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ, రూపాయి విలువ పతనం, పెట్రోల్ ధరల పెరుగుదల వంటి ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై రాహుల్ గాంధీ నిరంతరం ప్రజల తరపున స్వరం వినిపిస్తున్నారని అన్నారు. భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ దేశ ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని ఏర్పరచుకుని వారి విశ్వాసాన్ని సంపాదించారని తెలిపారు. దేశ యువత న్యాయం, సమాన అవకాశాలు మరియు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన వైపు ఆశతో చూస్తోందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ నేడు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేసిన ఎంపీ, రాజ్యసభ నామినేషన్ల వ్యవహారంలో పారదర్శకత లోపించిందని విమర్శించారు. పార్లమెంట్‌లో జాతీయ భద్రత, విదేశాంగ విధానాలకు సంబంధించిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమాధానాలు ఇవ్వడంలో విఫలమైందని ఆరోపించారు. దేశ గౌరవం, ప్రజాస్వామ్య విలువలు మరియు రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేసిన గడ్డం వంశీకృష్ణ, "ప్రజాస్వామ్యం కోసం, న్యాయం కోసం మా పోరాటం నిరంతరం కొనసాగుతుందని అన్నారు.

# పోలీసు స్టేషన్లకు నూతన పరికరాలను అందజేసిన జిల్లా ఎస్పీ








నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జూన్ 19 ,(ప్రజాజ్యోతి).జిల్లా పోలీసు శాఖను మరింత సాంకేతికంగా బలోపేతం చేయడం, ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో ఈరోజు నిర్మల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లకు నూతన సాంకేతిక పరికరాలను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, అందజేశారు.ఈ సందర్భంగా జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు బార్‌కోడ్ స్కానర్లు, లేబుల్ ప్రింటర్లు, సింగిల్ డిజిట్ స్కానర్లు, ఫింగర్ ప్రింట్ బ్యూరో సిస్టమ్స్, ఫింగర్ ప్రింట్ స్కానర్లు, ప్రింటర్లను పంపిణీ చేశారు.ప్రస్తుతం పోలీస్ స్టేషన్లలో కేసుల సంఖ్య పెరగడం, కంప్యూటర్లు, ట్యాబ్ల సాంకేతిక సమస్యల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఈ పరికరాలు ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా కోర్టు కేసుల వివరాలను వేగవంతంగా నమోదు చేయడం, కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు సమన్వయ అధికారులు,ప్రాసిక్యూషన్ అధికారులకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించడం ద్వారా న్యాయ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీటి సహకారం అందనుంది.

**పరికరాల ప్రాధాన్యత**

వేలిముద్ర (ఫింగర్ ప్రింట్) స్కానర్లు వ్యక్తుల గుర్తింపును ధృవీకరించడం, నేర చరిత్రను గుర్తించడం, అనుమానితుల వివరాలను తక్షణమే సేకరించడం మరియు పెండింగ్ కేసుల ఛేదనలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.సింగిల్ డిజిట్ స్కానర్లు పోర్టబుల్ బయోమెట్రిక్ పరికరాలైన ఇవి వ్యక్తుల గుర్తింపును క్షణాల్లో ధృవీకరించడంతో పాటు కేంద్రీకృత డేటాబేస్‌లతో సరిపోల్చి నేర చరిత్రను తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి.బార్‌కోడ్ స్కానర్లు ముద్రించిన బార్‌కోడ్‌లను డిజిటల్ సమాచారంగా మార్చి రికార్డుల నిర్వహణ, సాక్ష్యాల ట్రాకింగ్ మరియు ఇతర పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేస్తాయి.లేబుల్ ప్రింటర్లు కేసు ఫైళ్లు, సాక్ష్యాధారాలు మరియు ఇతర రికార్డులను ఖచ్చితంగా గుర్తించి నిర్వహించడంలో కీలకంగా ఉపయోగపడతాయి. తెలంగాణ పోలీస్ శాఖలో సాక్ష్యాల భద్రత, రికార్డుల నిర్వహణలో ఇవి ముఖ్యమైన సాధనాలుగా పని చేయనున్నాయి.జిల్లా పోలీస్ శాఖను మరింత సాంకేతికంగా బలోపేతం చేసి, ప్రజలకు వేగవంతమైన మరియు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పరికరాలను అందజేసినట్లు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.ఈ పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తో పాటు ఏఎ యూనస్ అలీ, ఇన్స్పెక్టర్లు కృష్ణ, గోవర్ధన్ రెడ్డి,సమ్మయ్య, ఆర్.ఐ (అడ్మిన్) రామ్ నిరంజన్ రావ్ ,ఎస్సైలు జీ.లింబాద్రి శ్రీకాంత్, రవీందర్ గణేష్ గోపి, శ్రావణి, హన్మండ్లు డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కృషితో మండలానికి ఎనిమిది గిడ్డంగులు మంజూరు



సారంగాపూర్, జూన్ 19,ప్రజా జ్యోతి మండలంలో రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవడానికి నియోజకవర్గంలో సరియైనటువంటి గిడ్డంగులు లేకపోవడంతో రైతులు ఇబ్బందుల ను చూసిన బీజేఎల్పి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గిడ్డంగుల అవసరాల గురించి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లగా ప్రభుత్వం ఎమ్మెల్యే కోరిక మేరకు సారంగాపూర్ మండలానికి 8 గిడ్డంగులు మంజూరు చేయించరు.మండలానికి గిడ్డంగులను మంజూరు చేయించినందుకు ఏమ్మెల్యేకు మండల పార్టీ అధ్యక్షుడు కాల్వ నవీన్,నాయకులు రామ్ శంకర్ రెడ్డి ,శ్రీకాంత్ రెడ్డి,రాజు రెడ్డి,దయాకర్ రెడ్డి, సత్యపాల్ రెడ్డి,కరిపే విలాస్ , గంగారెడ్డి,బడి పోతన్న, సబ్జెనానక్ సింగ్, కరుణాసాగర్ రెడ్డి, చిన్నయ్య, నారాయణ, మధు, రంజిత్, ప్రకాష్, వినోద్, చంద్రప్రకాష్ గౌడ్, తదితర నాయకులు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.

## సింగరేణి వ్యాప్తంగా మూడు ఏరియాల్లో ఈ వెబ్ కౌన్సెలింగ్

**పారదర్శకంగా మెకానికల్ సూపర్వైజర్ల ఎంపిక**



మంచిర్యాల, 19, జూన్ (ప్రజాజ్యోతి): సీనియారిటీ ఆధారంగా మెకానికల్ సూపర్వైజర్లు (డిప్లొమా హోల్డర్లు)తో పాటు ఇంటర్నల్, ఎక్స్టర్నల్ విధానంలో ఎంపికై ట్రైనింగ్ పూర్తిచేసుకున్న అసిస్టెంట్ ఫోర్మెన్ (ట్రైనీ)లకు ఏరియా స్థాయి లేదా ఇతర ఏరియాల్లో గుర్తించిన ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు (ఓసీపీ), ఇతర సర్ఫేస్ విభాగాల్లో ఖాళీల భర్తీ కోసం నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగినట్లు సింగరేణి అధికారులు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా మూడు ఏరియాల్లో ఈ వెబ్ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేట్, శ్రీరాంపూర్ , ఆర్జీ-1 ఏరియాల్లో ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగింది. శ్రీరాంపూర్ ఏరియాలో శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలకు చెందిన మొత్తం 15 మంది అభ్యర్థులు వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. పోస్టింగ్‌ల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించగా, అభ్యర్థులు తమ వ్యక్తిగత అభిరుచులు, అవకాశాలను పరిగణనలోకి తీసుకుని స్వయంగా ఆప్షన్లు ఎంపిక చేసుకున్నారు శ్రీరాంపూర్ వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న అభ్యర్థులు తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అనుకూలమైన ఏరియాల్లో పోస్టింగ్‌లను ఎంపిక చేసుకున్నారు. అయితే, నలుగురు అభ్యర్థులు తమకు అనుకూలమైన పోస్టులు అందుబాటులో లేకపోవడంతో "నాట్ విల్లింగ్" ఆప్షన్‌ను ఎంచుకుని వెనుదిరిగారు. మిగిలిన 11 మంది శ్రీరాంపూర్ ఏరియాతో పాటు ఇతర ఏరియాల్లో తమకు అనుకూలమైన పోస్టింగ్‌లను ఎంపిక చేసుకున్నారు. మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో నిర్వహించిన ఈ వెబ్ కౌన్సెలింగ్ కార్యక్రమం శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓటూ జీఎం ఎన్. సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, సీనియర్ పీఓ మురళి, ఐఈడీ ఇంజనీర్ సంగీత, సీనియర్ అసిస్టెంట్ నవీన్ ఆధ్వర్యంలో జరిగింది.

# ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్‌పై నస్పూర్ మండల అవగాహన సదస్సు





మంచిర్యాల, 19, జూన్ (ప్రజాజ్యోతి):సింగరేణి గెస్ట్ హౌస్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో నస్పూర్ మండల పరిధిలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్-ఎస్ఐఆర్ ) పై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. నస్పూర్ మండల తహసీల్దార్ సంఘర్ష సంతోష్ కుమార్ గారి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేయర్ శ్రీ ధరణి మధుకర్ గారు, మంచిర్యాల నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్ మరియు నాయబ్ తహసీల్దార్ గడియారం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయబ్ తహసీల్దార్ గడియారం శ్రీహరి మండల పరిధిలోని బీఎల్ఓలు, బీఎల్ఏలు మరియు సూపర్వైజర్లకు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఎలా సమర్థవంతంగా నిర్వహించాలో అవగాహన కల్పించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ప్రతి బీఎల్ఓ ఇంటింటికి వెళ్లి ఓటరు వివరాలను పరిశీలించి, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. అలాగే, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సంబంధించిన కిట్ బ్యాగులను తహసీల్దార్ సంఘర్ష సంతోష్ కుమార్ గారి చేతుల మీదుగా బీఎల్ఓలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ హరిత, గిర్దవర్ ప్రశాంత్ చందర్, ఎన్నికల విభాగ సీనియర్ సహాయకులు సంజీవ్, మండల పరిధిలోని బీఎల్ఓలు, బీఎల్ఏలు, సూపర్వైజర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాజకీయ జోక్యంతోనే సింగరేణి నష్టపోయింది

**తమ సమస్యల పరిష్కారానికి అధికారులు చేస్తున్న పోరాటానికి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ పూర్తి మద్దతు**

**తుమ్మల రాజారెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**


తుమ్మల రాజారెడ్డి,
SCEU (CITU) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**మంచిర్యాల, 19, జూన్ (ప్రజాజ్యోతి):** సింగరేణిలోని అధికారులు తమకు న్యాయంగా రావాల్సిన పీఆర్పీ ఇతర సమస్యల పరిష్కారం కోసం వివిధ పద్ధతుల్లో చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలకు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) తరపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి శుక్రవారం తెలిపారు.సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం పెరిగిందని కార్మిక సంఘాలు చాలా కాలంగా ప్రస్తావిస్తూ వస్తున్నాయని, ఇప్పుడు కార్మిక సంఘాలతో పాటు అధికారులు కూడా సంస్థలో రాజకీయ జోక్యం వద్దంటూ ముందుకు రావడం అభినందనీయమైన విషయమని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ స్థాయిలో వచ్చిన ఒత్తిళ్ల కారణంగా సంస్థకు ఏ విధంగా నష్టం జరిగిందనే అంశాలపై అధికారులు కూడా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మిక సంఘాలు, అధికారుల సంఘాలు కలిసి సంస్థ పరిరక్షణ కోసం అవసరమైతే ఒక ఉమ్మడి వేదికను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సంస్థ బలంగా ఉంటేనే కార్మికుల సమస్యలు, అధికారుల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు .సింగరేణి పరిరక్షణ కోసం అధికారులు, కార్మికులు కలిసి ప్రభుత్వంపై పోరాటం చేసి సంస్థకు రావాల్సిన బకాయిలను వసూలు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొంతమంది ఉన్నతస్థాయి అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి తీసుకున్న నిర్ణయాల ప్రభావం ఇప్పుడు సంస్థపై పడుతోందన్నారు. రాజకీయ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, అధికారం కోల్పోయిన తర్వాత మరో విధంగా సంస్థ గురించి మాట్లాడటం సరైన విధానం కాదని ఆయన విమర్శించారు. సింగరేణి వంటి కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించేందుకు అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తుమ్మల రాజారెడ్డి స్పష్టం చేశారు

# వర్షాకాలంలో థర్మల్ కేంద్రాలకు సరిపడా బొగ్గు సరఫరా చేస్తాము

**సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి**

**సింగరేణి - తెలంగాణ జెన్‌కో సమన్వయ సమావేశం**






**మంచిర్యాల, 19, జూన్ (ప్రజాజ్యోతి):**వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి కొంత ఆటంకం ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేస్తామని సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం తెలంగాణ జెన్‌కో ఛైర్మన్ డాక్టర్ హరీష్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతిని కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపై విస్తృతంగా చర్చించారు. వర్షాకాలంలో యాదాద్రి సహా రాష్ట్రంలోని అన్ని థర్మల్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కలగకుండా నాణ్యమైన బొగ్గును తగినంతగా అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ, సింగరేణి సంస్థ ఉత్పత్తి చేసే మొత్తం బొగ్గులో దాదాపు 93 శాతం బొగ్గు ఓపెన్ కాస్ట్ గనుల నుంచే వస్తుందని తెలిపారు. భారీ వర్షాల సమయంలో ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు ఏర్పడే అవకాశాలు ఉంటాయని అన్నారు. అయినప్పటికీ రాష్ట్ర విద్యుత్ అవసరాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా థర్మల్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరా కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వర్షాకాల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే అన్ని ఓపెన్ కాస్ట్ గనుల్లో ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు .ఈ నేపథ్యంలో వర్షాకాలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన బొగ్గు పరిమాణం, నిల్వలు, సరఫరా ప్రణాళికలపై కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. సింగరేణి సంస్థ రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సంవత్సరానికి దాదాపు 28 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేస్తోందని, రోజుకు 60 వేల నుంచి 70 వేల టన్నుల వరకు బొగ్గు సరఫరా చేస్తున్నట్లు సింగరేణి డైరెక్టర్లు వివరించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని, బొగ్గు నాణ్యత విషయంలో రాజీ పడకూడదని సీఎండీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) తాడబోయిన శ్రీనివాస్, తెలంగాణ జెన్‌కో ఈడీ నగ్యా, డైరెక్టర్ రాజశేఖర్, సీఈ లక్ష్మయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు

**ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పోరాటం ఆదర్శం**

**మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది**



**సారంగాపూర్, జూన్ 19,ప్రజా జ్యోతి** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనశీగా నిర్వహించరు. మండల కాంగ్రెస్ పార్టీ ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని కాంగ్రెస్ పార్టీని మరింత ముందుకు తీసుకుపోవాలని కోరరు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది, సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షులు కూనేరు భూమన్న, భోజ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజీ నర్స య్య,మాజీ మార్కెట్ చైర్మన్లు దశరథ్ రాజేశ్వర్ రాజ్ మహమ్మద్, శ్రీనివాస్ రెడ్డి, వంగా రవీందర్ రెడ్డి,సర్పంచ్ లు వడ్లకొండ దివ్య నవీన్, వరలక్ష్మి సాయన్న,మార్కెట్ డైరెక్టర్ లు పోతారెడ్డి, అహమ్మద్ ముక్తార్, మండల నాయకులు అట్లా పోత రెడ్డి, ఉప్పు లపు లింగారెడ్డి,నవీన్ రెడ్డి, భూమారెడ్డి, పరికి పండ్ల స్వదేశ్, విలాస్ రావు, బట్టు భోజన్న, మైలి రాజేశ్వర్, బలస్ట్ రాజేశ్వర్, ఓలత్రి నారాయణ రెడ్డి, దాసరి లక్ష్మణ్,సాక్ పెల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీఓ ను సన్మానించిన సర్పంచులు



**నేరడిగొండ జూన్ 19 (ప్రజాజ్యోతి):**నేరడిగొండ మండల నూతన ఎంపీడీఓ మరియు ఎంపీఓ గా బాధ్యతలు స్వీకరించిన జీవన్ రెడ్డి ని మండలంలోని పలు గ్రామాల సర్పంచులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన ఎంపీడీఓ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సానుకూలంగా స్పందిస్తూ, అధికారుల-ప్రజాప్రతినిధుల సమన్వయంతో ముందడుగు వేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ మండల సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆడెపు శ్రీకాంత్, బుద్దికొండ సర్పంచ్ మహేందర్ రెడ్డి, పీచర సర్పంచ్ బైరి రాజేందర్, నాగమల్యాల్ సర్పంచ్ గోడం అమృత్, వెంకటాపూర్ సర్పంచ్ వెంకట్రాం, బోరిగాం సర్పంచ్ వినేష్, కొరటికల్ (బి) సర్పంచ్ సుధాకర్, కుంటాల సర్పంచ్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి ఏరియాలో పర్యటించిన బి. వెంకన్న జాదవ్, ఐఆర్‌టీఎస్



**మంచిర్యాల, 19, జూన్ (ప్రజా జ్యోతి):**సింగరేణి సత్తుపల్లి ఏరియాలోని జలగం వెంగళరావు ఉపరితల గని (జేవీఆర్ ఓసీ-2)ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) మరియు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి. వెంకన్న జాదవ్, ఐఆర్‌టీఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా గనిలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా, బంకర్ కార్యకలాపాలు, బొగ్గు లోడింగ్ ప్రక్రియలు, నాణ్యత ప్రమాణాలను పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా వ్యవస్థలను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు నాణ్యత ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కోటపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి





**మంచిర్యాల, 19, జూన్ (ప్రజాజ్యోతి):**సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) ప్రాజెక్టు అధికారి మంద మకరందు మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి (డీటిడీవో), సహాయ గిరిజన అభివృద్ధి అధికారి (ఏటీడీవో) కూడా ఆయనతో పాటు పాల్గొన్నారు. పాఠశాల ఆవరణాన్ని పరిశీలించిన ప్రాజెక్టు అధికారి పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న వసతులు, తరగతి గదుల నిర్వహణ, వసతి గృహాల పరిస్థితులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, ఆరోగ్య పరిస్థితులు, ఆహార సదుపాయాలు, ఇతర అవసరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.అనంతరం పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనం, వసతి గృహాల్లో ఆహార నాణ్యత, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు





**మంచిర్యాల, 19, జూన్ (ప్రజాజ్యోతి):**భారతీయ రాజకీయాల్లో కీలక నాయకుడిగా, కాంగ్రెస్ అగ్రనేతగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా సేవలందిస్తున్న రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను చెన్నూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ఆదేశాల మేరకు చెన్నూర్ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ ఆద్వర్యం లో జరిపారు. ఈ సందర్భంగా చెన్న సూర్యనారాయణ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ దేశ రాజకీయాల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, యువత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని అన్నారు. భారతదేశ మాజీ ప్రధానమంత్రులు శ్రీమతి ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ వంటి రాజకీయ వారసత్వం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీ దేశ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందారని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం, యువతకు ఉద్యోగ అవకాశాలు, రైతులకు మద్దతు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి శ్రీనివాస్ పద్మ, మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కర్ణాసాగర్ రావు, కౌన్సిలర్లు అంబటి శంకర్ (3వ వార్డు), సుంకర సంతోష్ (8వ వార్డు), చెన్నూరి రాజేష్-స్వప్న (5వ వార్డు), హాజు (17వ వార్డు), పాతాళ నాగరాజు, లింగంపల్లి మహేష్, దాసరి కమలాకర్, సుల్తాన్, హిమవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో సింగరేణి ఉద్యోగులు, రిటైర్ కార్మికుల ప్రత్యేక కోటా సీట్ల

### భర్తీ కోసం ఈ నెల 11న నిర్వహించిన ప్రత్యేక కౌన్సెలింగ్

### మిగిలిన సీట్ల కోసం జులై 8 ,2026 న స్పాట్ కౌన్సెలింగ్

### పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కే . రాజేందర్






**మంచిర్యాల, 19, జూన్ (ప్రజాజ్యోతి):**మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో మైనింగ్, సివిల్ కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విభాగాలలో మొత్తం 300 సీట్లకు గాను 150 సీట్లు ప్రత్యేకంగా సింగరేణి వారసులకు కేటాయించటం జరిగింది. వీటి భర్తీ కోసం ఈ నెల 11 న ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించగా సింగరేణి ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల పిల్లలు తమకు అనుకూలమైన సీట్లు ఎంపిక చేసుకున్నారు. ఈ నెల 11 న కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సీట్లను జులై 8న స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేయనున్నట్లు . పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కే . రాజేందర్ శుక్రవారం తెలిపారు .ఇందుకు గాను జులై 7వ తేదీ వరకు ధరఖాస్తులు స్వీకరించబడునని, కాలేజీ వెబ్సైట్లో ఆన్లైన్ పద్ధతిలో లో ధరఖాస్తు చేసుకోవాలి. సింగరేణి ఉద్యోగుల వారసులకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది అనంతరం ఇతరుల పిల్లలు తమకు నచ్చిన సీట్లు ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు .ఇందుకోసం ప్రతీ విద్యార్థి కులం/జుబొా సర్టిఫికెట్, స్టడీ/బోనఫైడ్ సర్టిఫికెట్స్, నివాసధృవీకరణ పత్రం, పదవతరగతి షార్ట్ మెమో/ ఇంటర్నెట్ కాపీ, బదిలీ సర్టిఫికెట్(టి సి ) , పాలిసెట్ హాలిటికెట్ఉ ర్యాంకు కార్డు, విద్యార్థితో పాటు తల్లితండ్రుల ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్ పాస్బుక్ జిరాక్స్, విద్యార్థి తండ్రి విధులు నిర్వహిస్తున్న గని,లేదా కార్యాలయం నుంచి సర్వీస్ సర్టిఫికెట్ ఆన్లైన్ అప్లికేషన్ ఒరిజినల్ కాపీ, కాలేజీఫీజు (20,000/- నగదు), 8 పాస్పోర్టు సైజు ఫోటోలు, 10 ఎన్విలాప్ కవర్ల తో పాటు అన్ని సర్టిఫికెట్లు 4 సెట్లు జిరాక్స్ కాపీలతో కౌన్సెలింగ్కు హాజరు కావాల్సి ఉంటుంది అని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేందర్ వివరించారు.



# సింగరేణిని దోపిడీ చేసినవారు ఇప్పుడు వేషాలు మార్చుకుని వస్తున్నారు

## కార్మికులారా, తస్మాత్ జాగ్రత్త ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి. మాధవ నాయక్

## సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో సమావేశం

**మంచిర్యాల, 19, జూన్ (ప్రజాజ్యోతి):**సింగరేణిని దోపిడీ చేసినవారు ఇప్పుడు వేషాలు మార్చుకుని వస్తున్నారని, కార్మికులారా తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి. మాధవ నాయక్ హెచ్చారించారు . కొత్తగూడెంలోని బీఎంఎస్ భవన్లో శుక్రవారం సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో కార్పొరేట్ మరియు కొత్తగూడెం ఏరియాల ముఖ్య కార్యకర్తల సమావేశం యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు ఎ. వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి. మాధవ నాయక్ పాల్గొని మాట్లాడుతూ, గతంలో సింగరేణి నియామకాలలో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నవారు, సింగరేణిలో పలు అక్రమాలకు పాల్పడినవారు, తాడిచెర్ల బొగ్గు గనులు సింగరేణికి దక్కకుండా ప్రైవేటీకరణకు అప్పగించినవారు నేడు కొత్త వేషాలతో కార్మికుల ముందుకు వస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా కోయగూడెం, జేవీఆర్ ఓసీపీలను సింగరేణికి దక్కకుండా చేసి రాజకీయాలకు అనుబంధంగా ఉన్న ఆర్థిక ప్రయోజన వర్గాలకు వేలం ద్వారా అప్పగించేలా వ్యవహరించినవారే నేడు కార్మికుల హితైషులమని చెప్పుకోవడం ఆశ్చర్యకరమని అన్నారు. అలాగే సింగరేణికి ట్రాన్స్కో, జన్కో సంస్థల నుంచి రావాల్సిన సుమారు రూ.53 వేల కోట్ల బకాయిల సమస్య తీవ్రతరమవడానికి కారణమైనవారే ఇప్పుడు కొత్త రూపాల్లో కార్మికులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘానికి గౌరవ అధ్యక్షురాలిగా వ్యవహరించిన నాయకురాలు ప్రస్తుతం మరో కార్మిక సంఘంతో కలిసి కార్మికులను తప్పుదోవ పట్టించేందుకు కుట్రపూరితంగా ముందుకు వస్తున్నారని ఆయన విమర్శించారు. గతంలో సింగరేణి ప్రయోజనాలను దెబ్బతీసినవారే నేడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఒకవైపు జెండాలు మార్చుకుని అమాయకపు మాటలతో కార్మికులను మోసం చేసే ప్రయత్నాలు జరుగుతుండగా, మరోవైపు సాంకేతిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల లెక్కింపుల్లో జరిగిన తప్పిదాలను కుంభకోణాలుగా చిత్రీకరిస్తూ మళ్లీ సింగరేణిలో పట్టు సాధించేందుకు బీఆర్ఎస్ రాజకీయ పార్టీ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. కార్మిక సంఘాల నాయకుల ముసుగులో తిరుగుతున్న వ్యక్తులు మరోసారి కార్మికులను మోసం చేసి సింగరేణిని సంక్షోభంలోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కార్మిక సంక్షేమాన్ని పరమావధిగా, పరిశ్రమ ప్రగతిని



ఎజెండాగా, దేశాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని పోరాటం చేస్తున్న భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)కు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో గుర్తింపు పొందిన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ముఖ్యంగా మెడికల్ బోర్డుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోందని, మెడికల్గా అన్ఫిట్ అయిన కార్మికుల వారసులకు రావాల్సిన ఉద్యోగాల విషయంలో సంవత్సరాల తరబడి జాప్యం జరుగుతోందని అన్నారు. ఈ కారణంగా అనేక కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు .అదే సమయంలో వారసత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియను రాజకీయ ప్రచార కార్యక్రమాలుగా మార్చి, కొత్తగా ఉద్యోగాలు కల్పించినట్లుగా ప్రజల్లో భ్రమలు కలిగించడం సరికాదన్నారు. ఇలాంటి కార్యక్రమాల కోసం లక్షల రూపాయలు సింగరేణి ఖర్చు చేయడం, కార్మికులను రాజకీయ సభలకు తరలించడం వంటి చర్యలు సంస్థపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నాయని తెలిపారు. యాజమాన్యం రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా సంస్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అనవసర ఖర్చులను నివారించాలని బీఎంఎస్ డిమాండ్ చేస్తుందన్నారు. ప్రస్తుతం సింగరేణి కార్మికులకు అత్యవసరంగా కావలసింది 12వ వేతన ఒప్పందం కోసం జేబీసీసీఐ కమిటీని వెంటనే ఏర్పాటు చేయడమేనని స్పష్టం చేసారు .ఈ సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ జీవీ కృష్ణారెడ్డి, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీఎస్ పవన్ కుమార్, కార్పొరేట్ ఉపాధ్యక్షులు బి. రాంసింగ్, కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు మొగిలిపాక రవి, ఏరియా కార్యదర్శి కాసర్ల మోహన్, యూనియన్ నాయకులు ఎం. శ్రీనివాస్, అశోక్, బాలకృష్ణ, నరేష్, ఉదయ్, చంద్రశేఖర్, భీమా, వడ్డీకాసు, ఆత్రేయ, సుధాకర్, రాజేష్, సంగం చందర్, రాజమౌళి, నాగేశ్వరరావు, శేఖర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**తాండూర్ జూన్ 19 ప్రజాజ్యోతి** కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు మాజీ జాతీయ అధ్యక్షులు లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని తాండూర్ మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పట్టెం విష్ణు కళ్యాణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాండూర్ తాండూర్ మండల్ మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ . కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి ఈసా, సింగిల్ విండో డైరెక్టర్ మాసడి తిరుపతి, సర్పంచులు ముడిమడుగుల సురేష్ చందనాల రవి ముదామ్ గోవర్ధన్ సుందిళ్ల భూమయ్య ముద్దం రఘు ఉపసర్పంచ్లు మహేష్ కిరణ్ యూత్ కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మంతెన శివ తాండూర్ మండల ప్రధాన కార్యదర్శి పురంశెట్టి అరుణ్ మండల ఉపాధ్యక్షులు సింగరావ్ శ్రీధర్ రవితేజ హరీష్ ధర్మ నాయకులు రఘు సర్వర్ రఫ్ ఆదమ్ మాగ్దుమ్ మండిగా రవి కాంపెల శ్రీను రాజేశం నియాజ్ బాబా చంద్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు,

# రోబోటిక్ క్యాన్సర్ శస్త్ర చికిత్సలతో రోగులకు మెరుగైన జీవన నాణ్యత




**మంచిర్యాల ప్రతినిధి జూన్ 19 ప్రజా జ్యోతి:** క్యాన్సర్ చికిత్సలో రోబోటిక్ మరియు ఫ్లోరోసెన్స్ మార్గదర్శిత శస్త్రచికిత్సలు రోగులకు మెరుగైన ఫలితాల ను అందిస్తున్నాయని హైదరాబాద్ యశోద ఆసుపత్రి హైటెక్ సిటీ విభాగానికి చెందిన సీనియర్ శస్త్ర క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ రాజేష్ గౌడ్ తెలి పారు. శుక్రవారం మంచిర్యాల నార్త్ ఇన్ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. రోబోటిక్ సాంకేతికత ద్వారా అత్యంత ఖచ్చితత్వంతో శస్త్రచికిత్సలు నిర్వహించడం వల్ల రక్తనష్టం, నొప్పి, కణజాల నష్టం తగ్గి రోగులు త్వరగా కోలుకుంటున్నారని చెప్పారు. గర్భాశయ, అండాశయ, రొమ్ము, ప్రోస్టేట్, మూత్రపిండాలు, పెద్దప్రేగు, ఊపిరితిత్తుల క్యాన్సర్ల చికిత్సలో ఈ విధానం విశేష ఫలితాలు ఇస్తోందన్నారు. ఫ్లోరోసెన్స్ సాంకేతికతతో ప్రభావిత కణజాలాన్ని ఖచ్చితంగా గుర్తించి అవసరమైన భాగాలను మాత్రమే తొలగించే అవకాశం కలుగుతోందని తెలిపారు.ఈ ఆధునిక విధానాల వల్ల రోగులకు తక్కువ నొప్పి, తక్కువ రోజులు ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం, చిన్న మచ్చలు మరియు మెరుగైన జీవన నాణ్యత వంటి ప్రయోజనాలు లభిస్తున్నాయని డాక్టర్ రాజేష్ గౌడ్ పేర్కొన్నారు.

# అభివృద్ధికి మేము అడ్డు కాదు": కవ్వాల యువత, బీజేపీ కార్యకర్తలు.

## సర్పంచ్ వ్యాఖ్యలపై మండిపడ్డ శివాజీ యూత్



**జన్నారం,జూన్ 19(ప్రజాజ్యోతి)** మండలంలోని కవ్వాల గ్రామ సర్పంచ్ తీరు సరైనది కాదని,అభివృద్ధికి శివాజీ యూత్, బీజేపీ కార్యకర్తలు అడ్డుపడుతున్నారని సాక్షాత్తు ఎమ్మెల్యే కు చెప్పడం సరికాదు" అని సభ్యులు మండిపడ్డారు.గ్రామపంచాతీ అభివృద్ధి కొరకు నూతన సర్పంచ్ను ఎన్నుకోవాలని యువత అందరం కలిసి సక్రు నాయక్కు మద్దతుగా నిలిచి గెలిపించుకున్నాం. అలాంటిది మేమే అభివృద్ధికి అడ్డుపడుతున్నామని చెప్పడం సరికాదని వారు అన్నారు.ఇప్పటివరకు మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పథంలో ముందుకు వెళితే, కవ్వాల్ గ్రామం మాత్రం "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్టు ఉందని విమర్శించారు.అభివృద్ధి చేస్తే ముందుగా సంతోషించేది యువతేనని,ప్రతి విషయంలో గ్రామపంచాయతీకి యువత తోడుగా ఉంటామని వారు తెలిపారు.సర్పంచ్ మాటలు తమ మనోభావాలను దెబ్బతీశాయని, ఇకపై సర్పంచ్ తన పద్ధతిని మానుకోవాలని హెచ్చరించారు. ఇలాంటి పద్ధతి మానుకోకపోతే గ్రామపంచాయతీ సాక్షిగా అభివృద్ధి పనులపై వారిని నిలదీసి అడుగుతామన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ,శివాజీ యూత్ అధ్యక్షులు,సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి





**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, 19, జూన్ (ప్రజాజ్యోతి):** విద్యావ్యవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్‌తో కలిసి విద్యార్థులకు ఏకరూప దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యాసంస్థల అభివృద్ధి కోసం అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడలు, అదనపు తరగతి గదులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. జిల్లాలోని కస్తూరిబా గాంధీ విద్యాలయాలలో అదనపు తరగతి గదులు, భోజనశాలల నిర్మాణ పనులు చేపట్టి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు, అలాగే అధిక మొత్తంలో అడ్మిషన్లు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపొందించేందుకు విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులు పాఠశాలలకు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. నాణ్యమైన విద్య అందించడంలో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం విద్యారంగంతో పాటు వైద్య రంగ అభివృద్ధిపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, మాతా శిశు ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ బాటపట్టిన చిన్నారులు.. ఘనంగా అక్షరాభ్యాసం



**దండపల్లి, జూన్ 19(ప్రజాజ్యోతి):** మండలంలోని పెద్దపేట-2, నెల్కి వెంకటాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జె. వెంకటలక్ష్మి, ముత్యం రమాదేవి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు వయసున్న చిన్నారులను తల్లిదండ్రులు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని వారు కోరారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తామని, పోషకాహార విలువలతో కూడిన భోజనాన్ని పెడతామని వివరించారు. అనంతరం కేంద్రాల్లోని చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించి, విద్యా బుద్ధులు నేర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దపేట పంచాయతీ కార్యదర్శి, స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# దేశ ప్రధానిగా రాహుల్ గాంధీనీ చేసేవరకు అహర్నిశలు శ్రమిద్దాం.. డిసిసి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పిన్నింటి రఘునాథరెడ్డి.,,,





**తాండూర్ జూన్ 19 ప్రజాజ్యోతి** మన దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని చేసేంతవరకు ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు పెండింటి రఘునాథరెడ్డి అన్నారు శుక్రవారం రోజున తాండూరు మండల కేంద్రంలోని సురభి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన బి ఎల్ ఏ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మనందరం ఎంత శ్రమించామో అదే రీతిలో దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని చేసేంతవరకు కూడా అందరం కలిసికట్టుగా శ్రమించి పార్టీ కోసం పని చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారిని అధిష్టానం గుర్తించి పదవులను ఇవ్వడం జరుగుతుందని ఎలాంటి ఈ గ్రూపు రాజకీయాల్లో లేకుండా మనందరం కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని అన్నారు పాలక ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని మీ మండలంలో ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరించి అభివృద్ధి పనులను చేసేలా కృషి చేయడం జరుగుతుందన్నారు నేను కూడా ఒక సామాన్య కార్యకర్తగా పనిచేసే 30 సంవత్సరాల తర్వాత నాకు జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టడం జరిగిందని మీ అందరి ఆదరాభిమానాలతో కాంగ్రెస్ పార్టీ కోసం సేవించడం జరుగుతుందన్నారు పదవుల కోసం ఎప్పుడు ఎవరు ఆశపడద్దని కాంగ్రెస్ కుటుంబ గౌరవం కోసం ప్రతి ఒక్కరూ హోర్నిశలు శ్రమించాలన్నారు తాండూర్ మండలానికి సంబంధించిన అధ్యక్ష పదవితో పాటు మరిన్ని పదవుల అభ్యర్థుల పేర్లను ఈరోజు ఖరారు చేయడం జరిగిందని వారందరూ కూడా పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిసి అధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గట్టు మురళీధర్ రావు సర్వాజీ మహేందర్ రావు శాలిగామా బా నయ్య సుభాష్ సర్పంచులు వార్డు సభ్యులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు,,

# శ్రీరాంపూర్‌లో హక్కుల సాధనకు కదం తొక్కిన సింగరేణి అధికారులు

**భారీ నిరసన ర్యాలీ**

**పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ అధికారుల హెచ్చరిక**

**మంచిర్యాల, 19, జూన్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో తమ హక్కుల సాధన కోసం సింగరేణి అధికారులు కదం తొక్కారు .తమ న్యాయమైన హక్కులు, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సింగరేణి అధికారులు ఉద్యమ బాట పట్టారు. అఖిల భారత బొగ్గు గనుల అధికారుల సంఘం (సీఎంఓఏఐ) సింగరేణి బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అధికారుల డిమాండ్ల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.మనోరంజన్ సముదాయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సిర్కె సెంటర్, రాయల్ టాకీస్ మీదుగా సీసీసీ కార్నర్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో బెల్లంపల్లి రీజియన్, రామగుండం రీజియన్ నుంచి పెద్ద సంఖ్యలో అధికారులు పాల్గొని తమ ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, 2017 వేతన సవరణలో జరిగిన నష్టాన్ని సరిచేసి అమలు చేయాలని, కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్)లో అమలవుతున్న పే అప్‌గ్రేడేషన్‌ను సింగరేణిలో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అధికారుల వేతనాల్లో భాగమైన రెండు సంవత్సరాల పీఆర్పీ (పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే) బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలపై యాజమాన్యం అధికారులతో చర్చించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి సంస్థ భవిష్యత్తు అభివృద్ధి, ఉద్యోగ భద్రత దృష్ట్యా కోక్ బొగ్గు బ్లాకులను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎంఓఏఐ సింగరేణి యూనిట్ అధ్యక్షుడు టి. లక్ష్మీపతి గౌడ్, జనరల్ సెక్రటరీ నర్సింహులు, వైస్ ప్రెసిడెంట్ పానుగోటి శ్రీనివాస్ రావు,




శ్రీరాంపూర్ బ్రాంచి అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, అధికారుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం మొండి వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. కోల్ ఇండియాలో పీఆర్పీ చెల్లిస్తున్నప్పటికీ గత రెండేళ్లుగా సింగరేణిలో అమలు చేయడం లేదని, అలాగే 2006 లోనే కోల్ ఇండియాలో పే అప్‌గ్రేడేషన్ అమల్లోకి వచ్చినప్పటికీ సింగరేణిలో ఇప్పటికీ అమలు కాకపోవడం విచారకరమన్నారు. కోల్ ఇండియాలో అమలవుతున్న పలు భత్యాలు సింగరేణి అధికారులకు అందడం లేదని ఆరోపించారు. ఉత్పత్తి, ఉత్పాదక లక్ష్యాల సాధనలో సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేసే అధికారుల సమస్యల పరిష్కారంపై యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంభించడం శోచనీయమన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే సంస్థ వ్యవహారాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని అన్నారు.సమస్యల పరిష్కారం వరకు దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తామని, అవసరమైతే సమ్మెకు కూడా సిద్ధమని హెచ్చరించారు. సింగరేణిని కన్నతల్లిలా భావించే అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లోనే ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందని, ఇప్పటికైనా యాజమాన్యం పెద్దమనసుతో స్పందించి తమ సమస్యలకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

# సాదా బైనమా దరఖాస్తుల పరిశీలన పగడ్బందీగా చేపట్టాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు**

**మంచిర్యాల, 19, జూన్ (ప్రజాజ్యోతి):**జిల్లాలో సాదా బైనమా దరఖాస్తుల పరిష్కారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత రికార్డులను అనుసరించి పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని కోటపల్లి, చెన్నూర్ మండలాల తహసిల్దార్ కార్యాలయాలను బి సెక్షన్ సూపరింటెండెంట్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, భూ సేకరణ అంశాలపై కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాదా బైనమా దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని భూ సమస్యల త్వరిత పరిష్కారం కోసం ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, విరాసత్ తదితర భూ సంబంధిత సేవలను నిబంధనల ప్రకారం వేగవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. భూ సేకరణ ప్రక్రియలో భూములు కోల్పోయిన



రైతులకు నష్టపరిహారం విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, సర్టిఫికెట్లను నిర్ణీత గడువులోగా జారీ చేయాలని సూచించారు. చెన్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం హెల్ప్‌డెస్క్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని, ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అక్షరాభ్యాసంతో విద్యకు ప్రాధాన్యం

మేదరవాడ స్కూల్‌లో పుస్తకాలు, ఫుడ్స్ పంపిణీ

బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి: సర్పంచ్ గంగారం



**ఆసిఫాబాద్ జూన్ 20 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండలం లోని అంకుసాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మేదరవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమం లో భాగంగా అక్షరాభ్యాసం, పుస్తకాల పంపిణీ, ఫుడ్స్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆసిఫాబాద్ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, సర్పంచ్ టేకం గంగారం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ గంగారం మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదువుకొని అధికారులైతే తల్లిదండ్రులు ఎంతో సంతోషిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా వినాలని సూచించారు.కార్యక్రమంలో హెచ్ఎం సంతోషి రాణి, ఉప సర్పంచ్ దుర్గం లక్ష్మి, వార్డు సభ్యుడు బండి మల్లేష్, ఉపాధ్యాయులు, సీఆర్పీ, సప్న మేడం, నాందేవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కెరమెరిలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ పోరాటం ఆదర్శనీయం

**యువత, రైతులు, పేదల సంక్షేమమే రాహుల్ గాంధీ లక్ష్యం: కాంగ్రెస్ నేతలు**



**ఆసిఫాబాద్ జూన్ 20 ప్రజా జ్యోతి** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కెరమెరి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ, యువతకు ఉపాధి అవకాశాలు, రైతులు మరియు పేదల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, రాహుల్ గాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాజిద్ దేశముఖ్, ఉప సర్పంచ్ వాగ్మరే శ్రీకాంత్, సుజాయిత్ ఖాన్, రాథోడ్ సుదర్శన్, గిడ్డప్ప, జగన్నాథ్ రావు, ఆత్రం తిరుపతి, మడావి రాజు దిలీప్, దండుగుల వెంకటి, దుర్గం వినేష్, అయూబ్ ఖాన్, గంటేవాడ్ మురళి, నార్నూర్ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షేక్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

## వి-డెంటల్ కేర్ హాస్పిటల్ ను ప్రారంభించిన సర్పంచ్



**జన్నారం,జూన్ 19(ప్రజాజ్యోతి)** జన్నారం మండలం పోనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని మేదరివాడ వాసి కూడల శ్రీనివాసరావు-స్వర్ణలత దంపతుల కుమారుడు, ఎండి.ఎస్ డాక్టర్ కూడల వెంకట్రామన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "వి-డెంటల్ కేర్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్" ను పోనకల్ గ్రామ సర్పంచ్ జక్కు సుప్య, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ గుప్త శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని, నాణ్యమైన చికిత్సలు అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బాణావత్ రాజేందర్,ఉప సర్పంచ్ అప్పాల జలపతి తదితరులు పాల్గొన్నారు.

## ఏటీసీ కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు:ఎస్ఐ

ఉదయ్ కిరణ్



**జన్నారం,జూన్ 19(ప్రజాజ్యోతి)**ఐటీఐ,ఏటీసీ కళాశాలకు సంబంధించిన ప్రచార గోడ ప్రతులను శుక్రవారం రోజున స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్.ఐ ఉదయ్ కిరణ్ ఐటిఐ ప్రిన్సిపాల్ రమేష్ తో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్ఐ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అడ్వాన్స్డ్ ట్రైనింగ్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని దీంతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.ఉద్యోగం చేయాలన్న ఆసక్తి, ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకోవాలనే తపన యువతలో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జన్నారం ఐటిఐ ప్రిన్సిపల్ శ్రీ వై. రమేష్ పర్యవేక్షకులు పి.బాను,ఏటిఓ ఎం.శంకర్ పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**జన్నారం,జూన్19(ప్రజాజ్యోతి)** లోక్‌సభ ప్రతిపక్ష నేత కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ మండల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా కేక్ కట్ చేసి కార్యకర్తలు ఒకరికొకరు పంచుకున్నారు.రాహుల్ గాంధీ సేవలను కొనియాడారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ సయ్యద్ ఫసిఉల్లా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజ్మీర నందు నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇసాక్, జిల్లా కార్యదర్శి ముజాఫర్ అలీ ఖాన్, పట్టణ అధ్యక్షుడు మంద రాజేష్,పార్టీ నాయకులు హేమంత్ చారి, అజహర్, రమేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు యూనియన్ బ్యాంక్ "యూనియన్ సన్మాన్ పెన్షన్ ప్యాకేజ్" వర్తింపజేయాలి

**మంచిర్యాల, 19, జూన్ (ప్రజాజ్యోతి):**సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మేడిపల్లి శాఖ, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మేనేజర్ కరుణాకర్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, బొగ్గు గనుల భవిష్యనిధి సంస్థ ద్వారా పెన్షన్ పొందుతున్న వారికి "యూనియన్ సన్మాన్ పెన్షన్ ప్యాకేజ్" సౌకర్యాలను విస్తరించాలని కోరారు. ప్రస్తుతం సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల్లో అధిక సంఖ్యలో యూనియన్ బ్యాంకులోనే పెన్షన్ ఖాతాలు నిర్వహిస్తున్నారని, వారు ఎన్నో సంవత్సరాలుగా బ్యాంకుకు విశ్వసనీయ ఖాతాదారులుగా కొనసాగుతున్నారని తెలిపారు. ఇతర పెన్షనర్లకు అందిస్తున్న "యూనియన్ సన్మాన్ పెన్షన్ ప్యాకేజ్"ను సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు కూడా వర్తింపజేయడం న్యాయసమ్మతమని విజ్ఞప్తి చేశారు. ఈ ప్యాకేజీ ద్వారా జీరో బ్యాలెన్స్ పెన్షన్ సేవింగ్స్ ఖాతా, వార్షిక రుసుము లేని ఉచిత రూపే ప్లాటినం డెబిట్ కార్డు, వ్యక్తిగత ప్రమాద బీమా, వైమానిక ప్రమాద బీమా, ఉచిత వార్షిక ఆరోగ్య పరీక్షలు, సీనియర్ సిటిజన్లకు ఉచిత డోర్‌స్టెప్ బ్యాంకింగ్ సేవలు, వ్యక్తిగత, గృహ, వాహన తదితర రుణాలపై ప్రాసెసింగ్ ఫీజులో రాయితీలు, లాకర్



అద్దెలో మినహాయింపులు లేదా రాయితీలు, ఉచిత చెక్‌బుక్, ఎస్ఎంఎస్ అలర్ట్స్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ సేవలు, పెన్షనర్ల కోసం ప్రత్యేక బ్యాంకింగ్ సేవలు, ఫిర్యాదుల త్వరిత పరిష్కారం వంటి అనేక ప్రయోజనాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ వినతిపత్రాన్ని ఉన్నతాధికారులకు పంపించి, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు కూడా యూనియన్ సన్మాన్ పెన్షన్ ప్యాకేజ్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ కోరిందని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు కంచె బీరయ్య, చుక్కల నర్సయ్య, టి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# శ్రీరాంపూర్‌లో హక్కుల సాధనకు కదం తొక్కిన సింగరేణి అధికారులు

## భారీ నిరసన ర్యాలీ పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ అధికారుల హెచ్చరిక





**మంచిర్యాల, 19, జూన్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో తమ హక్కుల సాధన కోసం సింగరేణి అధికారులు కదం తొక్కారు .తమ న్యాయమైన హక్కులు, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సింగరేణి అధికారులు ఉద్యమ బాట పట్టారు. అఖిల భారత బొగ్గు గనుల అధికారుల సంఘం (సీఎంఓఏఐ) సింగరేణి బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అధికారుల డిమాండ్ల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మనోరంజన్ సముదాయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సిర్కె సెంటర్, రాయల్ టాకీస్ మీదుగా సీసీసీ కార్నర్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో బెల్లంపల్లి రీజియన్, రామగుండం రీజియన్ నుంచి పెద్ద సంఖ్యలో అధికారులు పాల్గొని తమ ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, 2017 వేతన సవరణలో జరిగిన నష్టాన్ని సరిచేసి అమలు చేయాలని, కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్)లో అమలవుతున్న పే అప్‌గ్రేడేషన్‌ను సింగరేణిలో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అధికారుల వేతనాల్లో భాగమైన రెండు సంవత్సరాల పీఆర్పీ (పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే) బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలపై యాజమాన్యం అధికారులతో చర్చించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి సంస్థ భవిష్యత్తు అభివృద్ధి, ఉద్యోగ భద్రత దృష్ట్యా కోక్ బొగ్గు బ్లాకులను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎంఓఏఐ సింగరేణి యూనిట్ అధ్యక్షుడు టి. లక్ష్మీపతి గౌడ్, జనరల్ సెక్రటరీ నర్సింహులు, వైస్ ప్రెసిడెంట్ పొనుగోటి శ్రీనివాస్ రావు, శ్రీరాంపూర్ బ్రాంచి అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, అధికారుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం మొండి వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. కోల్ ఇండియాలో పీఆర్పీ చెల్లిస్తున్నప్పటికీ గత రెండేళ్లుగా సింగరేణిలో అమలు చేయడం లేదని, అలాగే 2006 లోనే కోల్ ఇండియాలో పే అప్‌గ్రేడేషన్ అమల్లోకి వచ్చినప్పటికీ సింగరేణిలో ఇప్పటికీ అమలు కాకపోవడం విచారకరమన్నారు. కోల్ ఇండియాలో అమలవుతున్న పలు భత్యాలు సింగరేణి అధికారులకు అందడం లేదని ఆరోపించారు. ఉత్పత్తి, ఉత్పాదక లక్ష్యాల సాధనలో సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేసే అధికారుల సమస్యల పరిష్కారంపై యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం శోచనీయమన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే సంస్థ వ్యవహారాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని అన్నారు.సమస్యల పరిష్కారం వరకు దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తామని, అవసరమైతే సమ్మెకు కూడా సిద్ధమని హెచ్చరించారు. సింగరేణిని కన్నతల్లిలా భావించే అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లోనే ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందని, ఇప్పటికైనా యాజమాన్యం పెద్దమనసుతో స్పందించి తమ సమస్యలకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

## బ్లేడ్ ట్రాక్టర్ ఆటో ఢీ ఆటో డ్రైవర్ మృతి, ఒకరికి గాయాలు



**జన్నారం,జూన్19 (ప్రజాజ్యోతి)** గురువారం రాత్రి మహమ్మదాబాద్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పవన్ మరణించగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయని జన్నారం ఎస్ఐ గుర్రం ఉదయ్ కిరణ్ తెలిపారు.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం నుంచి మహమ్మదాబాద్ వైపు వెళ్తున్న ఆటో నెం.01 ఖదీ 2854ను, ఎదురుగా తాళ్లపేట వైపు నుంచి జన్నారం వెళ్తున్న 25 9012 నెంబర్ గల బ్లేడ్ ట్రాక్టర్ ఢీకొట్టింది.ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ వచ్చి ఆటోను ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మగ్గిడి సురేష్ (30) మహమ్మదాబాద్ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా,శుక్రవారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో చికిత్స పొందుతూ మరణించారు.ఆటోలో ప్రయాణిస్తున్న అదే గ్రామానికిచెందిన సునర్కరీ పవన్‌కు రెండు మోకాళ్ల వద్ద గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారు.

## విద్య హక్కు చట్టం అమలు చేయాలి

### డీవైఎఫ్ఐ

### విద్య వ్యాపారీకరణను అరికట్టాలని వినతి



**ఆసిఫాబాద్ జూన్ 20 ప్రజా జ్యోతి** జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టి, విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి డి. సచ్చిదానంద చారికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్య కల్పించాలని కోరారు. కొన్ని పాఠశాలలు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, షూలు తదితర వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తూ విద్యను వ్యాపారంగా మార్చాయని విమర్శించారు.వినతిపై స్పందించిన డీఈవో సచ్చిదానంద చారి, ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యా హక్కు చట్టం అమలు, పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాల కల్పనపై చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.

## దుబ్బపల్లి ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం



**జైపూర్ జూన్ 19 ప్రజా జ్యోతి** జైపూర్ మండలంలోని దుబ్బపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఉపాధ్యాయురాలు శ్యామల, అంగన్వాడీ టీచర్ జాడి శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారు లకు తల్లిదండ్రుల సమక్షంలో అక్షరాభ్యాసం చేయించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పలు ఉచిత సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఉపాధ్యాయులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిర నందన్ విద్యార్థులకు పలకలు, బలపాలు పంపిణీ చేయగా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆయాలు పాల్గొన్నారు.

## ఎండలు వానల మిశ్రమ ప్రభావం.. మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి!

### వాతావరణ శాఖ అంచనా ప్రకారం జూలై 8లోపు వానాకాలం ప్రారంభమయ్యే అవకాశం అధికం



**మంచిర్యాల, 19,జూన్ ( ప్రజా జ్యోతి):** రాష్ట్రంలో ఎండలు, వర్షాల మిశ్రమ ప్రభావం మరో నాలుగు రోజులపాటు కొనసాగనున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు జిల్లాల్లో ఒకవైపు వడగాలులు వీచే అవ కాశం ఉండగా, మరోవైపు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. వాతావరణ శాఖ వివరాల ప్రకారం ఈ ఏడాది వానాకాలం ప్రారంభానికి అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. మీ మండలంలో జూలై 8 తేదీకి ముందే ఎప్పుడైనా నిరంతర వానాకాలం ప్రారంభమయ్యే అవకాశం ఎక్కువగా ఉందని అంచనా వేసింది. ఈ తేదీకి ముందే వానాకాలం ప్రారంభమయ్యే అవకాశాలు సుమారు 65 శాతం ఉన్నట్లు పేర్కొంది. అదే జూలై 8 తర్వాత వానాకాలం ప్రారంభమయ్యే అవకాశం 35 శాతానికి పరిమితమైందని తెలిపింది. రేపటి వాతావరణ పరిస్థితులపై విడుదల చేసిన నివేదికలో ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అదే సమయంలో మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర మైతేనే మధ్యాహ్న వేళల్లో బయటకు రావాలని సూచించింది.

## పాఠశాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

### - కలెక్టర్ కుమార్ దీపక్



**జైపూర్, జూన్ 19 (ప్రజా జ్యోతి)**ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేపట్టిన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం గంగిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు.పనుల్లో నాణ్యతతో పాటు వేగం ఉండాలని సూచించారు. పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసిన జైపూర్ కాంగ్రెస్ నాయకులు



**జైపూర్ జూన్ 19 ప్రజా జ్యోతి** జైపూర్ మండలంలోని కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు.మండలంలోని వివిధ గ్రామలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సర్పంచులు, ఉప సర్పంచులు, జిల్లా నాయకులు, మండల నాయకులు శు క్రవారం సిద్దిపేటకు చేరుకున్నారు.ఈ సందర్భంగా మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జైపూర్ మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై మంత్రితో చర్చించారు. మండల అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందించాలని నాయకులు మంత్రిని కోరారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. రాహుల్ గాంధీ ఆశయాల సాధనకు కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి సమిష్టిగా పనిచేస్తామని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బొగ్గు అక్రమ రవాణా వెనుక మాఫియా వ్యవస్థ పనిచేస్తోంది

**పూర్తి స్థాయి విచారణ జరిపి దోషులను బయటపెట్టాలి**
**బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి**
**బీజేపీ ఆధ్వర్యంలో "సింగరేణి భరోసా" కార్యక్రమం**





**మంచిర్యాల, 19, జూన్ (ప్రజాజ్యోతి):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సింగరేణి ప్రాంతంలో "సింగరేణి భరోసా" కార్యక్రమాన్ని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలోని గనుల ప్రాంతాల్లో పర్యటన చేపట్టారు. అదనంగా బీజేపీ ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణా రెడ్డి, పాల్వాయి హరీశ్ బాబు, పైడి రాకేష్ రెడ్డి, రామారావు పటేల్, ధనపాల్ సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నస్పూర్ సింగరేణి గెస్ట్ హౌస్ నుంచి ప్రారంభమైన యాత్రలో నేతలు ఎస్ఆర్పీ--ఓసీ, ఎస్ఆర్పీ--3 గనులను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. మధ్యలో శ్రీరాంపూర్ కాలనీ బస్ స్టాండ్ వద్ద ఉన్న సింగరేణి కార్మికుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి నినాదాలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మద్దతుగా నినాదాలు చేశారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతి, కార్మికుల మౌలిక వసతులు, కార్మికుల సమస్యలను పరిశీలిస్తూ భారతీయ జనతా పార్టీ ఈ సింగరేణి భరోసా కార్యక్రమాన్ని చేపట్టింది. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్న సమయంలో బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులను ఓపెన్ కాస్ట్ ప్రాంతానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. అనంతరం కొంతమంది ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో బీజేపీ కార్యకర్తలు పోలీసు వాహనాలను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వేల టన్నుల బొగ్గు మాయం కావడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బొగ్గు అక్రమ రవాణా వెనుక మాఫియా వ్యవస్థ పనిచేస్తోందని ఆరోపించారు. రాజకీయ జోక్యం కూడా ఈ స్కామ్‌లో ఉందని పేర్కొన్నారు. పూర్తి స్థాయి విచారణ జరిపి దోషులను బయటపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా సింగరేణిలో జరుగుతున్న అక్రమాలను కప్పిపుచ్చడానికే బీజేపీ నాయకులను ఓపెన్ కాస్ట్ ప్రాంతానికి వెళ్లకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. సింగరేణి వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని విమర్శించారు. సింగరేణి సొమ్మును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దోచుకుంటున్నారని ఆరోపిస్తూ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకున్న సింగరేణి సొమ్మును కక్కించే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు. కాగా బీజేపీ చేపట్టిన సింగరేణి భరోసా యాత్రకు పోలీసులు అనుమతుల విషయంలో నిరాకరణ వ్యక్తం చేసినప్పటికీ నాయకులు యాత్రను కొనసాగించారు. యాత్ర సందర్భంగా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సింగరేణి భరోసా యాత్ర పేరుతో శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ సందర్శనకు వచ్చిన తమపై పోలీసులు విరుచుకుపడ్డారని బీజేపీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం పార్టీ పిలుపు మేరకు శాంతియుతంగా వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని విచక్షణ రహితంగా కొట్టారని, తమకు గాయాలయ్యాయని చూపించారు. పోలీసుల చర్యలను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఈ సింగరేణి భరోసా యాత్రలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన గ్రామ కార్యదర్శి స్వప్నకు ఘన సన్మానం



**ఆసిఫాబాద్, జూన్ 19 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండలం లోనీ ఈదులవాడ గ్రామపంచాయతీ నూతన కార్యదర్శిగా నియమితులైన స్వప్నను కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫస్ట్ వార్డు నాయకుడు ఎలగల మహేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు మామిడి కిరణ్, కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఎస్కే అబ్బు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు, గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల పై చర్చించారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన కార్యదర్శి స్వప్నను నాయకులు కోరారు. ప్రాంత అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రైయిన్ పనులకు శంకుస్థాపన

**జంబుల్ధరిలో ఎఫ్ఎఫ్‌సీ నిధులతో నిర్మాణం**
**ప్రజల వినతి మేరకు చర్యలు: సర్పంచ్ పవన్**



**ఆసిఫాబాద్ జూన్ 20 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం జంబుల్ధరి గ్రామ పంచాయతీలో ఉధవ్ ఇంటి నుంచి వాసుదేవ్ ఇంటి వరకు సైడ్ డ్రైయిన్ నిర్మాణ పనులకు సర్పంచ్ కుమ్రం పవన్ కుమార్ మంగళవారం శ్రీకారం చుట్టారు. ఎఫ్ఎఫ్‌సీ నిధులతో పనులు చేపట్టారు. గ్రామంలో డ్రైయిన్ లేక వర్షపు నీరు నిల్వ ఉంటూ పారిశుధ్య సమస్యలు వస్తున్నాయని ప్రజలు కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని సర్పంచ్ తెలిపారు. పనులు పూర్తయితే నీటి నిల్వ తొలగి గ్రామం శుభ్రంగా ఉంటుందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ విట్టల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ, పంచాయతీ కార్యదర్శి జహూర్ అహ్మద్, వార్డు మెంబర్ మొందుబాయి, వాసుదేవ్, శ్రీను, మొగిలి సత్యమ్మ, కరోబర్ హరిదాస్ పాల్గొన్నారు.

## గాలివాన ధాటికి ఇల్లు ధ్వంసం

**లంజన్‌వీర్‌లో రమ కుటుంబానికి తీవ్ర నష్టం**
**ప్రభుత్వ సాయం కోసం బాధితుల ఎదురుచూపు**



**ఆసిఫాబాద్ జూన్ 19 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి మండలం జంబుల్ధరి జీపీ పరిధిలోని లంజన్‌వీర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన కుండపోత వర్షం బీభత్సం సృష్టించింది. గ్రామానికి చెందిన రమ ఇంటి పైకప్పు రేకులు బలమైన గాలులకు ఎగిరిపోవడంతో ఇంట్లోని సామగ్రి అంతా వర్షానికి తడిసి పాడైపోయింది. ఇంట్లో నిల్వ ఉంచిన యూరియా ఎరువుల సంచులు సైతం పూర్తిగా తడవడంతో రైతు కుటుంబానికి ఆర్థిక నష్టం తప్పలేదు. ఘటనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాన్ని స్థానికులు పరామర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోవాలని బాధితులు, గ్రామస్థులు కోరుతున్నారు.

## 23 వేల స్కూళ్ల మూసివేత నిర్ణయం వెనక్కి తీసుకోవాలి: పీడీఎస్‌యూ



**ఆసిఫాబాద్ జూన్ 20 ప్రజా జ్యోతి** రాష్ట్రంలో 23 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి డిమాండ్ చేశారు. జనకాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నిర్ణయం పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలకు కొత్త నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు, ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.